

ఏటూరునాగారం : దుర్గామాత విగ్రహం వద్ద భక్తులు



గోవిందరావుపేట : నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు



మంగపేట : కొలువుదీరిన అమ్మవారు

# మండపాల్లో కొలువైన దుర్గామాత

ఏటూరునాగారం, అక్టోబర్ 15 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గామాతను ప్రత్యేక మండపాల్లో ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కమిటీలు ఏర్పాట్లు చేశాయి. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం, రామాలయం, శివాలయం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయ నిర్మాణ స్థలం, నేతాజీ నగర్ తదితర ప్రాంతాల్లో దుర్గామాత విగ్రహాలు కొలువుదీరాయి. అనేక మంది భక్తులు భవానీ మాలలు ధరించారు.

**గోవిందరావుపేటలో..**

గోవిందరావుపేట : మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లను మండపాల్లో ప్రతిష్ఠించారు. చల్వాయి, గోవిందరావుపేట, పస్రా గ్రామాల్లో జరిగిన ఉత్సవాల్లో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రజలు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

**మంగపేటలో..**

మంగపేట : మండలకేంద్రంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారు కొలువుదీరారు. మొదటి రోజు అమ్మవారు భక్తులకు బాలా త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ మేరకు భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.

## ఎన్నికల సమన్వయ కమిటీలోకి వెంకన్న

ములుగు, అక్టోబర్15 (నమస్తే తెలంగాణ) : ములుగు నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడిగా కోళ్ల వెంకన్నను నియమిస్తున్నట్లు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో వెంకన్న బీఆర్ఎస్‌లో చేరగా, ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపునకు కృషి చేయాలని శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. తనను బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయ కమిటీలోకి తీసుకున్నందుకు వెంకన్న కృతజ్ఞతలు తెలిపారు. తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెడుతూ భారీ మెజార్టీతో నాగజ్యోతిని గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని వెంకన్న ఈ సందర్భంగా వెల్లడించారు.



నినాదాలు చేస్తున్న ఎంపీటీసీ, వార్డుల ఇన్‌చార్జీలు

## నాగజ్యోతి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ములుగు రూరల్, అక్టోబర్ 15 : జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఎంపీటీసీ సానికొమ్ము రాజ్యలక్ష్మీ రమేశ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు దేవగిరిపట్నంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 10 వార్డులకు ఇన్‌చార్జిలను నియమించారు. అనంతరం ఎంపీటీసీ మాట్లాడుతూ మొత్తం 100 ఓట్లకు కాలనీల వారీగా ఇన్‌చార్జిలను నియమించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో పాటు జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో దొడ్డ వెంకటేశ్వర్‌రెడ్డి, వాంకుడోత్ రాందాస్, సూరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, తుమ్మ పుల్లారెడ్డి, దొడ్డ గోపాల్‌రెడ్డి, ఉడుముల సుబ్బారెడ్డి, కొండి సాంబయ్య, కరెంటుసింగ్, భద్రునాయక్, బాదవత్ బాలాజీ, కుందూరు కృష్ణారెడ్డి, జన్న బాలు, ఎనగందుల ప్రభాకర్, భోగం కుమార్, జగన్, శంకర్, మల్లయ్య, సంజీవ, రాజేందర్, ఇన్నారెడ్డి, రాజు, స్వామి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

మంగపేట, అక్టోబర్ 15 : మండలంలోని జబ్బోనిగూడెం గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం విద్యుదాఘాతంతో రైతు దుర్గం సత్యం (47) మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోరు నర్సాపూర్ గ్రామానికి చెందిన దుర్గం సత్యం జబ్బోనిగూడెం సమీపంలో తన సొంత భూమిలో మిర్చి సాగు చేస్తున్నాడు. కాగా, తన మోటరుకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో మరో లైన్‌కు సర్వీస్ వైరు మార్చి నడిపిస్తున్నాడు. విద్యుత్ సరఫరా అవుతున్న క్రమంలో సర్వీసు వైరు జాయింట్ వద్ద పట్టుకోగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు.



యువతకు కంప్యూటర్, పుస్తకాలను అందజేస్తున్న డీఎస్పీ రవీందర్

## బెల్టుషాపులపై దాడులు

**రూ. 30 వేల మద్యం స్వాధీనం - నలుగురిపై కేసు నమోదు**

ఏటూరునాగారం, అక్టోబర్ 15 : మండలంలో బెల్టు షాపులపై ఆదివారం దాడులు నిర్వహించి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఏటూరునాగారం, రామన్నగూడెం, రాంనగర్‌లోని కిరాణా షాపులు, హోట ల్స్, బెల్టు షాపుల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఏటూరునాగారానికి చెందిన బత్తిని మల్లయ్య, సరిత, రాంనగర్‌కు చెందిన జయకృష్ణ, రామన్నగూడెంకు చెందిన శ్రీను మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసినట్లు తెలిపారు. నలుగురి నుంచి సుమారు రూ. 30వేల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## 17న మండల సభ

తాడ్వాయి, అక్టోబర్15 : మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 17 (మంగళవారం)న ఎంపీపీ గొంది వాణిశ్రీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యాంజనేయప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

## జాతర విజయవంతానికి కృషి చేయాలి

- **ములుగు డీఎస్పీ రవీందర్**

తాడ్వాయి, అక్టోబర్ 15 : వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మల మహాజాతర విజయవంతానికి స్థానిక యువత కృషి చేయాలని ములుగు డీఎస్పీ రవీందర్ అన్నారు. మండలంలోని మేడారంలో ఆదివారం అభ్యుదయ యువజన సంఘానికి రెండు కంప్యూటర్లతో పాటు లైబ్రరీ పుస్తకాలను అందజేశారు. 15 రోజుల క్రితం సంఘం సభ్యులు జిల్లా ఎస్పీ గౌష్ ఆలంను కలిసి యువత విద్య, ఉద్యోగాల్లో రాణించేందుకు కంప్యూటర్లు, పుస్తకాలు కావాలని కోరగా ఎస్పీ త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్ఐ ఓంకార్‌యాదవ్‌తో కలిసి డీఎస్పీ రవీందర్ వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. మేడారం మహాజాతరలో యువత పాత్ర కీలకమని, ఈసారి కూడా పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు. యూత్ అధ్యక్షుడు భోజారావు, సభ్యులు అనిల్, రమేశ్, శంకర్, సమ్మారావు, జనార్దన్, సునీల్, వెంకటేశ్, రవి, అర్జున్, తరుణ్, ప్రవీణ్, సురేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న దేవాదుల నీటి పంపింగ్

కన్నాయిగూడెం, అక్టోబర్ 15 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని మూడు మోటర్లతో గోదావరి నీటి పంపింగ్ కొనసాగుతోంది. ఫేస్ 3లోని 1, 2, 5 మోటర్లను ఆన్ చేసినట్లు డీఈ శరత్ తెలిపారు. వానకాలం సీజన్ పంటలకు నీటిని అందించేందుకు మోటర్ల ద్వారా 1.775 టీఎంసీల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు.



కాశీంపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## ఘనంగా అటుకుల బతుకమ్మ

**ఆడిపాడిన మహిళలు, చిన్నారులు**

కృష్ణకాలనీ, అక్టోబర్ 15 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆయా వార్డుల్లో రెండో రోజైన ఆదివారం అటుకుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆయా వార్డుల్లోని ప్రధాన కూడళ్లు, ఆలయ ప్రాంగణాలు, సెగ్గంపల్లి, గడ్డిగానిపల్లిల్లో ప్రభుత్వ పాఠశాలల మైదానాల్లో, కాశీంపల్లిలో హనుమాన్ దేవాలయం వద్ద, స్తూపం ఆవరణలోని మైదానంలో, జవహర్‌నగర్‌లోని పోచమ్మ గుడి వద్ద, జయశంకర్ కాలనీలో లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద, రెవెన్యూ కాలనీలో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో, రెడ్డికాలనీలోని సాధన స్కూల్ మైదానంలో, కృష్ణకాలనీలోని అంబేద్కర్ మైదానంలో, కారల్ మార్క్స్ కాలనీలోని శివాలయం ఆవరణలో, కేటీకే 6 ఇంక్లైన్ ప్రధాన గేటు ఆవరణలో, 6 ఇంక్లైన్ లైన్ బ్యారెక్‌లో, టీ -2 క్వార్టర్స్ వాటర్ ట్యాంక్ వద్ద, రాజీవ్ నగర్‌కాలనీలో ఎర్రచెరువు వద్ద, పైలట్ కాలనీలోని పాత ఎస్పీ కార్యాలయం ఆవరణలో, జంగేడులోని హనుమాన్ దేవాలయం ఆవరణలో, సుభాష్ కాలనీలోని రామాలయం, న్యూ సుభాష్‌కాలనీలోని వినాయక మండపం మైదానం, ఎల్‌బీ నగర్ గాంధీ జూనియర్ కాలేజీ మైదానం, గాంధీనగర్, రాంనగర్ కాలనీల్లో వినాయక మండపాల ఆవరణలో, శాంతినగర్ జంగేడు రోడ్డులో, లక్ష్మీనగర్, హనుమాన్‌నగర్‌లలో పాత అంగడి మైదానంలో, మహబూబ్‌పల్లిలో బీఆర్ఎస్ జెండా ఆవరణలో, పల్లూరి రామయ్యపల్లిలో హనుమాన్ దేవాలయం మైదానంలో, బీసీ కాలనీలోని 8 ఇంక్లైన్ రోడ్డు వద్ద మహిళలు బతుకమ్మలతో ఆడి, పాడారు. అనంతరం సప్పిడిపప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి సమర్పించారు.

# రామప్పలో పర్యాటకుల సందడి

- **పూజలు చేసిన జిల్లా జడ్జి దంపతులు**
- **సందర్శించిన విదేశీయురాలు**

వెంకటాపూర్, అక్టోబర్ 15 : మండలంలోని రామప్ప దేవాలయం ఆదివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం సరస్సుకు చేరుకొని బోటింగ్ చేశారు.

**పూజలు చేసిన జిల్లా జడ్జి దంపతులు**

ఆదివారం రామప్పను జిల్లా జడ్జి లలితా శివజ్యోతి దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు, స్వామి వారి శేషవస్త్రాలు బహూకరించారు. అనంతరం వారు రామప్ప చెరువును సందర్శించారు. వారి వెంట ఎస్సై చల్లా రాజు, పోలీస్, టూరిజం, దేవాదాయ, పురావస్తు శాఖల సిబ్బంది ఉన్నారు.



పూజలు చేస్తున్న జడ్జి లలితా శివజ్యోతి దంపతులు

**అమేజింగ్ టెంపుల్..**

అమెరికా దేశానికి చెందిన స్మోల్కా టిప్పనీ స్టేట్ టూరిస్ట్ గైడ్ కుమార్‌తో కలిసి రామప్పను సందర్శించారు. ఆలయ విశిష్టతను గైడ్స్ ద్వారా తెలుసుకొని మాట్లాడుతూ అమేజింగ్ టెంపుల్, వేరీ ఫైన్ కార్వింగ్స్ అంటూ కొనియాడారు. తన కెమెరాతో శిల్పాలను ఫొటోలు తీసుకున్నారు.



శిల్ప కళను తిలకిస్తున్న విదేశీయురాలు